క్లుప్తంగా

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ. 17.22 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీలు లెక్కించారు. 38 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.17,22,154 వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. కార్యక్రమంలో అలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

కె.కె. రాజుకు ఆత్మీయ సత్కారం



కె.కె.రాజును సత్కరిస్తున్న కె.వి. బాబా, ఇతర ముస్లిం నాయకులు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కేవీ బాబా, ఇతర ముస్లిం నాయకులు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజును మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి పదవి కల్పించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఐ.హెచ్. ఫరూఖీ, పార్టీ మైనారిటీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, విశాఖ జిల్లా పెన్షన్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, (అలియాస్ మొహమ్మద్ ఇబ్రహీం), 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, వార్డు కార్యదర్శి బాబ్జి, విశాఖ జిల్లా మైనారిటీ సెల్ సెక్రటరీ నిజాం, పార్టీ సీనియర్ నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ 538 మార్కులు సాధించిన దీపికకి రూ.10 వేలు, 532 మార్కులు సాధించిన జి. ఎర్రమ్మకు రూ.10 వేలు, 523 మార్కులు సాధించిన ఒ. చాందినికి రూ.8 వేలు అందజేశారు. పద్మపూజిత ఫౌండేషన్ అధినేత బసవరాజు రూ. 12 వేలు, ఎంజీఎం పాఠశాలలో 1983–84 బ్యాచ్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు రూ. 10 వేలు ఉత్తమ విద్యార్థులకు అందజేశారు. జీకే ఫౌండేషన్ అధినేత గోపీకృష్ణ, 33వ వార్డు కార్పొరేటర్ వసంతలక్ష్మి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శివప్రసాద్‌రెడ్డి, బంటుపల్లి సూర్యనారాయణ, ఆకుల రాజు, చక్రవరి, భాస్కర్, నీలం రాజు, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు ఊరట

అల్లిపురం: జీవీఎంసీ సర్వే నంబర్ 7 రేసపువానిపాలెంలో అక్రమ నిర్మాణాలకు అనుమతించిన ట్లు చెప్పబడుతున్న టీపీబీవో కె. లావణ్య, ఇంజినీరు డి.శ్రీనివాసులు అక్రమ నిర్మాణాలను నివారించడంలో విఫలమైనందుకు, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంలో తగిన చర్యలు తీసుకోకపోవడం, ఆక్రమణలను అనుమతించడం వల్ల జీవీఎంసీకి ఆర్థికంగా నష్టం కలిగిందని నిర్ధారించబడిన కారణంగా మూడేళ్ల పాటు ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కె.లావణ్య, డి.శ్రీనివాసులు అప్పీలుకు వెళ్లడంతో నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేసి వాటిని క్రమబద్ధీకరించినందు వల్ల స్థానిక సంస్థకు ఆర్థిక నష్టం కలగనందున మొదట విడుదల చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ (సీసీ–ఎ) నిబంధనలు 1991లోని నిబంధన 38 ప్రకారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కుంచె కదులుతోంది.. కడుపు నిండుతోంది

- యోగాంధ్ర పుణ్యమా అంటూ పెయింటర్లకు ఉపాధి
- యోగాసనాలతో చూపరులను ఆకట్టుకుంటున్న చిత్రాలు
- రైల్వేస్టేషన్, కాన్వెంట్ జంక్షన్‌లలో జోరుగా సుందరీకరణ పనులు
- సృజనాత్మకత చాటుతున్న కళాకారులు



రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రహరీపై యోగా సంబంధిత చిత్రాలు వేస్తున్న పెయింటర్లు

డాబాగార్డెన్స్: కుంచె కదులుతోంది.. ఉపాధి దొరుకుతోంది. దశాబ్ద కాలంగా పూట గడవని పెయింటర్లకు జి–20 గ్లోబల్ మీట్ పుణ్యమా అంటూ 2022–23లో పనులు దొరికాయి.. మూడు పూట్ల తిండి దొరికింది. తర్వాత రెండేళ్ల పెయింటర్లకు పెద్దగా పనులు దొరకలేదు. తాజాగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా పెయింటర్లకు మళ్లీ ఉపాధి దొరికినట్టయింది. యోగాసనాల చిత్రాలు వేస్తూ పెయింటర్లు చేతి నిండా పని దొరకడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో పెయింటర్లకు పని లేకుండా పోయింది. అత్యాధునిక పరికరాలు వచ్చేయడంతో పెయింటర్ల వ్యవస్థ కనుమరుగైపోతోంది. ఆ వృత్తినే నమ్ముకునే వారు కూలి పనులకు వెళ్లిపోతున్నారు. విశాఖలో అంతర్జాతీయ వేదికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పెయింటర్లకు పనులు దొరకడం మొదలైంది. పెయింటింగ్ కళనే నమ్ముకున్న కళాకారులకు ఊరట కలుగుతోంది. సినిమా బేనర్లు.. పెళ్లి, శుభ కార్యాల బేనర్ల వంటివి రాయడంతో పాటు సైన్‌బోర్డులు.. వ్యాపార సంస్థల ప్రకటనలకు సంబంధించిన పెయింటింగ్స్‌తో నిత్యం బిజీ బిజీగా ఉంటూ జీవనోపాధి సాగించుకునే చిత్రకారులకు ఫ్లెక్సీలు వచ్చి కడుపు కొట్టిన విషయం తెలిసిందే. యోగాంధ్ర పుణ్యమా అంటూ పెయింటర్లకు పాతరోజులు వచ్చినట్టయింది.

రోజులు మారాయి..

పెయింటింగ్ పనులనే నమ్ముకుని ఉండిపోయిన వారికి కడుపునిండా పని దొరుకుతోంది. స్మార్ట్‌సిటీలో తరచూ అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. తాజాగా ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్రమోదీతో పాటు వివిధ దేశాల ప్రముఖులు, మంత్రులు పెద్ద సంఖ్యలో రానున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. దీనిలో భాగంగా విశాఖలో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. నగరంలోని పెయింటర్లు ప్రధాన జంక్షన్లు, రోడ్లకు ఇరువైపులా వేస్తున్న సందేశాత్మక చిత్రాలు (యోగాసనాల పెయింటింగులు) చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నిలబడి చేసే ఆసనాలు, కూర్చుని చేసే ఆసనాలు, అష్టాంగ యోగాసనాలు, అయ్యంగార్ యోగాసనాలు, విన్యాస యోగాసనాలు, కుండలినీ యోగాసనాలు ఇలా ఎన్నో రకాలుగా పెయింటర్లు యోగాసన చిత్రాలను గోడలపై చిత్రీకరిస్తున్నారు.

పలుచోట్ల..

యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దక్షిణ నియోజకవర్గం పరిధిలోని రైల్వేస్టేషన్, ఎంఈఎస్ కార్యాలయం, కాన్వెంట్ జంక్షన్, వుడా తదితర ప్రాంతాల్లోని గోడలు, ఇతర కాన్వాస్‌లపై కళాకారులు పలు రకాల యోగసనాల చిత్రాలు అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రాల వల్ల ఆయా ప్రాంతాలు కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి.



అశ్వ సంచలన నాశన చిత్రం వేస్తున్న పెయింటర్

పనులు దొరుకుతున్నాయి..



వారం రోజులుగా పనులు దొరుకుతున్నాయి. గత కొంత కాలంగా పనుల్లేక ఆర్థికంగా అనేక మంది పెయింటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యోగాంధ్ర పుణ్యమా అంటూ పనులు దొరకడం వల్ల ఒక్కో పెయింటర్ కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇదే తరహాలో జీ–20.. గ్లోబల్ సమ్మిట్‌లో పెయింటర్లందరికీ పనులు దొరికాయి. సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో పెయింటింగ్ పనులే నమ్ముకుని ఉండిపోయిన ఎంతో మందికి ఇలాంటి ఈవెంట్లు ఎంతో కొంత పని కల్పిస్తున్నాయి.

– రాజు, సూర్యాభాగ్



స్టేషన్ రోడ్డులోని ఎంఈఎస్ కార్యాలయ ఫుట్‌పాత్ ప్రహరీపై యోగాసనాల చిత్రాలు



కాన్వెంట్ బ్రిడ్జి కింద పెయింటింగ్ వేస్తున్న పెయింటర్లు, కళాకారులు



పెయింటర్లు వేసిన అపురూప యోగాసనాల చిత్రాలు

కాశీవిశ్వనాథుని దర్శించుకున్న ఆశ్రమవాసులు



గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న స్వామి వివేకానంద సంస్థ ఆశ్రమ వాసులు

డాబాగార్డెన్స్: దాతల సహకారంతో స్వామి వివేకానంద సంస్థ ఆశ్రమ వాసులను సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా కాశీ విశ్వనాథుడి దర్శనానికి తీసుకెళ్లారు. ఆశ్రమ వాసులు కాశీ వెళ్లి విశ్వనాథుడిని, అన్నపూర్ణమాత, కాశీ విశాలాక్షిని దర్శించుకున్నట్లు అప్పారావు తెలిపారు. గంగానదిలో పుణ్య స్నానాలు ఆచరించి, కాశీ విశ్వనాథుడిని పూజించినట్లు తెలిపారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందిన అభాగ్యులు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది రైల్వే పోలీసుల సహకారంతో బుధవారం ఎనిమిది మంది నిరాశ్రయులను జీవీఎంసీ టీఎస్‌ఆర్ షెల్టర్ హోంకు తరలించారు. దయగాన్, ఒడిశాకు చెందిన ప్రీతీ రాజేశ్వరి, బీహార్‌కు చెందిన సుఖన్, బొబ్బిలికి చెందిన తాబ్బరి సత్యనారాయణ, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన లాకోజీ నారాయణ స్వామి, గుర్లకు చెందిన పెనుబర్తి నాయుడు, కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన రాజు, దువ్వాడకు చెందిన నిర్మల్ సింగ్, బీహార్, బంకాకు చెందిన సంతోష్ కుమార్ శర్మ తదితరులను షెల్టర్‌కు తరలించారు. వీరిలో ఒక్కరు మినహా మిగతా వాళ్ల మానసిక స్థితి సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పెట్టింది తింటూ బతుకుతున్నారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీరందరినీ ఫుట్ పాత్‌లు ఖాళీ చేయించి షెల్టర్లకు తరలించినట్లు వాసు తెలిపారు.

‘తల్లికి వందనం’ బాధితురాలికి వాసుపల్లి ఆర్థిక సాయం

- పథకాల కోతపై ప్రభుత్వంపై మండిపాటు



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కారణంగా తల్లికి వందనం పథకం పొందలేకపోయిన గ్రంధి గౌరీ పిల్లల పాఠశాల ఫీజుకు వాసుపల్లి సహాయాన్ని అర్థించారు. దీంతో ఆయన రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ రూ.12 వేల జీతానికి పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలు నిలిపివేయడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందక మధ్య తరగతి, నిరుపేదలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరిగిన పుస్తకాల ధరలు, ఫీజులు, యూనిఫారాలు, షూ, బెల్టులు తల్లిదండ్రులకు గుదిబండల్లా మారాయన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ అమ్మ ఒడి అందివ్వడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన వసతులు, యూనిఫారాలు, లాప్‌టాప్‌లు కూడా అందించారన్నారు. చంద్రబాబు అమలు కాని హామీలు ఇచ్చి, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ స్పందించి, టీడీపీ నుంచి బయటికి వచ్చి ప్రజల తరఫున పోరాటం చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంచినీరు సరఫరా చేయండి



నిరసన తెలుపుతున్న బుక్కా వీధి మహిళలు తదితరులు

- రోడ్డెక్కిన 38వ వార్డు బుక్కావీధి మహిళలు

డాబాగార్డెన్స్: బుక్కా వీధిలో మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ స్థానిక మహిళలు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిటు నాయకుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విశాఖపట్నాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబునాయుడు చెబుతున్నారని, తాగునీరే సరఫరా చేయలేని ఈ కూటమి ప్రభుత్వం నగరాన్ని ఏం ఉద్ధరిస్తుందని ప్రశ్నించారు. నెలల తరబడి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్నా, జీవీఎంసీ అధికారులకు చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి, నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా బాగు చేయకుండా పాలకులు, జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆరోపించారు. తాగునీటి పైపులైన్ల ద్వారా మురుగు నీరు వచ్చేస్తుందని అనేక సార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా కనీస స్పందన లేదన్నారు. జీవీఎంసీ సరఫరా చేసే తాగునీటిని తాగి ఈ ప్రాంత వాసులు డయేరియాతో ఆస్పత్రి పాలవుతున్నారని, చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు నెలల కిందట కలెక్టర్‌ని కలిసి సమస్య గురించి మొరపెట్టుకుంటే నెలలో సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. యోగా చేసి గిన్నిస్ బుక్ రికార్డు ఎక్కాలని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు తహతహలాడుతున్నారని, ఇదే నగరంలో మంచినీరు సరిగ్గా ఇవ్వలేని వారు గిన్నిస్ బుక్‌ల కోసం ఆలోచించడం విడ్డూరంగా ఉందన్నారు. నిరసన ధర్నాలో చంద్రశేఖర్, సూరాడ లక్ష్మి, సత్యం, రామలక్ష్మి, ఎల్లయ్యమ్మ, రమ, అమర సత్య, చంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీయూ వైజాగ్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఆర్చి బిషప్ ఉడుముల బాల

డాబాగార్డెన్స్: ఆలిండియా క్యాథలిక్ యూనియన్ విశాఖపట్నం సర్వసభ్య సమావేశం బుధవారం మహారాణిపేట ఆర్‌సీఎం పాస్ట్రల్ సెంటర్ హాల్లో నిర్వహించారు. విశాఖ ఆర్చి బిషప్ ఉడుముల బాల పాల్గొని పలు సూచనలు చేశారు. సంఘం విశాఖ గౌరవ అధ్యక్షుడు గోన స్వామినాథం మాట్లాడుతూ ఏఐసీయూ విధి విధానాలు, కార్యకలాపాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ తదితర విషయాలు వివరించారు. సంఘం విశాఖ రీజియన్ అధ్యక్షుడు, జాతీయ సహాయ కార్యదర్శి బూర వేలంగిణి రవీంద్ర శేషుబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, సమాజ సేవ, విద్యాభివృద్ధి, పేదలు, అభాగ్యులు, బడుగు వర్గాలను పైకి తీసుకురావడంలోనూ ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, వందేళ్ల పైబడిన సంఘం పురోగతిని వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏఐసీయూ సభ్యుడు చిట్టిబాబును ఆర్చి బిషప్ ఉడుముల బాల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ ఎం.ప్రతాప్, విశాఖ అర్బన్ డీన్ ఫాదర్ ఎస్.ప్రతాప్, ఏఐసీయూ కార్యదర్శి బేతా జోసెఫ్, కోశాధికారి పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎస్‌ఆర్ కాలనీ వాసులు

డాబాగార్డెన్స్: ఏఎస్‌ఆర్ కాలనీలో నివాసముంటున్న 134 నిరుపేద కుటుంబాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ కాలనీ నాయకులు బుధవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఇళ్లు పొందినప్పటికీ తాగునీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చూడాలని ఆ వినతిలో పేర్కొన్నారు. అలాగే చాలా మంది బీపీఎల్ కార్డుదారులు కావడం, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పన్నులు చెల్లించలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. అదనపు కమిషనర్ స్పందించి మంచినీటి కుళాయి కనెక్షన్ల విషయాన్ని వాటర్ సరఫరా అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, పన్నుల సమస్యపై సంబంధిత శాఖలతో చర్చించి పరిష్కార మార్గాలు సూచిస్తామని హామీ ఇచ్చారని కాలనీ వాసులు ఎస్.సతీష్, నారాయణ, నిఖిల, అజయ్ తెలిపారు.

అనాథ ప్రేత సేవలో..



అనాథ మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: స్థానిక బీఆర్ రెడ్డి జంక్షన్‌లో ఆదివారం ఉదయం అనాథ మహిళ ఒకరు మరణించి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అక్కడికి చేరుకున్నారు. ఆమె కోసం చుట్టుపక్కల వాకబు చేసి ఆమె అనాథగా గుర్తించారు. దీంతో ఆయన టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో వారు చావులమదుం స్మశాన వాటికకు తరలించారు. అక్కడ ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. పరవాడ ఆప్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–2పై వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో అవగాహన సదస్సులో సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి పార్టీ వార్డు అధ్యక్షుల కృతజ్ఞతలు



వాసుపల్లిని సత్కరిస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, వార్డు నాయకులు



వాసుపల్లిని సత్కరిస్తున్న 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, నాయకులు

డాబాగార్డెన్స్: పార్టీ అభివృద్ధికి కష్టపడిన వారిని నియోజకవర్గంలో వార్డు అధ్యక్షుల పదవులు వరించాయి. ఈ మేరకు బుధవారం 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కోన శంకర్ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తమపై నమ్మకం ఉంచి పదవులు కల్పించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ సిటీ సెక్రటరీ అబ్బిరెడ్డి ఆదివిష్ణురెడ్డి, బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్రభరత్, జిల్లా ఆర్‌టీఐ ప్రెసిడెంట్ వడ్డాది దిలీప్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కోన శంకర్‌తో పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఆకుల శ్యామ్, సువార్తరాజు, జీరు సూర్యనారాయణ, తాడి రవితేజ, భీశెట్టి ప్రసాద్, దశమంతుల చిన్ని, కర్రి రాము, బత్తుల రాము, గంగాధర్, కనకమ్మ, యాల్ల రమణమ్మ, సిమ్మా పుష్ప, అలపన రమణమ్మ, పోలవరపు రమణమ్మ, రంగాల రవికుమార్, నాగిరెడ్డి రాంబాబు, లండా సుధా, పిట్టా శ్రీనివాసరెడ్డి, వేణు, బాలు, కోన ప్రకాష్, ఈశ్వర్, వినోద్, నగేష్, శేఖర్, దుర్గాప్రసాద్, అజయ్, మాలిబాబు, సాగర్, సత్య, రామరాజు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పీతల వాసును సత్కరిస్తున్న వార్డు నాయకులు, అనుబంధ సంఘాల నేతలు

వైఎస్సార్‌సీపీ 29వ వార్డు అధ్యక్షుడికి సత్కారం..

జీవీఎంసీ 29వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పీతల వాసు మరోసారి నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని నాయకులు ఆరుగుల రాజ్‌కుమార్, పార్టీ సౌత్ సోషల్ మీడియా అధ్యక్షుడు బెవర మహేష్, సిటీ యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి చంద్రమౌళి ఆయనను బుధవారం సత్కరించారు. పైబోడి శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో యోగా డే ప్రత్యేక కార్యక్రమాలు



యోగా డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం –2025లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ నేతృత్వంలో బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల స్కూల్ విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక విద్యార్థులు, రైల్వే ఉద్యోగుల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్‌లోని రైల్వే ఉద్యోగుల కోసం ఇదే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా రైల్వే సిబ్బంది, ఉద్యోగులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఉద్యోగుల కుటుంబాలు కలిసి పలు రైల్వే స్టేషన్లలో యోగా సాధన చేశారు. పిల్లలు, పెద్దలు, ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా మనసు, శరీరాన్ని అదుపులో ఉంచుకోవచ్చని డీఆర్‌ఎం లలిత్ బోరా ఈ సందర్భంగా తన సందేశంలో తెలిపారు.